క్లుప్తంగా

ఘనంగా సహస్ర కలశ పూజ


సహస్ర కలశ పూజలో పాల్గొన్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం మాసశివ రాత్రి సందర్భంగా అర్చకులు భాస్కర్‌శర్మ, రమణశర్మల ఆధ్వర్యంలో సహస్ర కలశ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా 1,148 మంది దంపతులు గణపతి పూజ, గో పూజ, శివలింగ ఆకారంలో కలశాలు ఉంచి వాటికి ప్రత్యేక కలశ పూజ చేశారు. అనంతరం 21 రకాల ద్రవ్యాలతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. పూజా కార్యక్రమాల్లో జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి దంపతులు, ఆలయ చైర్మన్ పడాల వెంకటరామా రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరసన్న ఆలయంలో అన్నసమారాధన


భోజనం చేస్తున్న భక్తులు

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నిత్యాన్నసమారాధన కొనసాగుతోంది. స్వామి వారి కల్యాణం అనంతరం కొద్ది రోజులు నిలిపివేశారు. అనంతరం శనివారం నుంచి పునఃప్రారంభించారు. కాగా.. దూర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి వస్తున్న భక్తులు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుంది. కొండపైన, కింద స్వామివారిని దర్శించుకున్న భక్తులందరికీ భోజనం అందజేస్తున్నామని అన్నవరం వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ తెలిపారు.

వైభవంగా అమ్మవారి జాతర

సీతానగరం: గ్రామంలోని సంతలో ముసలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా జరుగుతోంది. ఈనెల 18న ప్రారంభమైన ఈ జాతర 25 వరకు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక నాలుగు బొమ్మల సెంటర్ వద్ద గల అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈనెల 26న అన్నసమారాధన జరుగుతుంది.

ఏటీఎంల వద్ద భద్రత పెంచాలి


బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వాసు

పెదపూడి: ఏటీఎంల వద్ద చోరీల నివారణకు బ్యాంకు అధికారులు భద్రత పెంచాలని పెదపూడి ఎస్‌ఐ పి.వాసు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద రామేశ్వరం, పెదపూడి, జి.మామిడాడ, ఏపీత్రయం గ్రామాల్లోని బ్యాంకు మేనేజర్లతో ఏటీఎంల వద్ద జరుగుతున్న చోరీల నివారణపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వాసు మాట్లాడుతూ బ్యాంకు అధికారులు ఏటీఎంల వద్ద సీసీ కెమెరాలు పకడ్బందీగా ఏర్పాటుచేయాలని సూచించారు. సమావేశంలో బ్యాంకు మేనేజర్లు కె.మునేంద్రరావు, స్వర్ణలత, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు 40 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు లెక్కలు పేపర్–1ఎ, బోటనీ పేపర్–1, సివిక్స్ పేపర్–1 పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఈ పరీక్షకు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 289 మంది హాజరు కావాల్సి ఉండగా 271 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 297 మంది హాజరు కావాల్సి ఉండగా 278 మంది హాజరయ్యారని, మొత్తంగా 40 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కేవీ రామకష్ణ, సీహెచ్ఏ శిరీషలు తెలిపారు. మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులుక మేథమెటిక్స్, బోటనీ, సివిక్స్ పేపర్–2 పరీక్ష నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.

కోరుకొండలో 35 మంది..

మధురపూడి: కోరుకొండ జూనియర్ కాలేజీలో సోమవారం నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 35 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరం లెక్కలు, బోటనీ, సివిక్స్ పరీక్షలతో పాటు, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. లెక్కలు, బోటనీ, సివిక్స్ పరీక్షలకు మొత్తం విద్యార్థులు 452 మంది హాజరుకావాల్సి ఉండగా, 425 మంది మాత్రమే రాశారు. ఒకేషనల్‌కు సంబంధించి 102 మందికి 94 మంది మాత్రమే హాజరయ్యారు.

రాగి జావకు రైట్‌రైట్..

- పాఠశాలల్లో నేటి నుంచి బ్రేక్‌ఫాస్ట్‌గా అమలు
- విద్యార్థులకు మరింత పౌష్టికాహారం
- జగనన్న గోరుముద్ద మెనూలో మార్పులు
- 1,26,212 మంది విద్యార్థులకు మేలు


రాగి జావ



పాఠశాలలకు చేరిన రాగి జావ పిండి ప్యాకెట్లు

రాజమహేంద్రవరం రూరల్/కంబాలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికీ సంపూర్ణ పోషకాహారం అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం పటిష్టంగా అమలు చేస్తోంది. దీని మెనూలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ విద్యార్థులకు మరిన్ని పోషకాలతో కూడిన ఆహారం అందిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం అందిస్తున్న ఆహార పదార్థాలతో పాటు మంగళవారం నుంచి విద్యార్థులకు రాగి జావ అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో రాగి జావ అందించాలని నిర్ణయించింది. ఈ పథకం అమలుకు అవసరమయ్యే బెల్లం, రాగి పిండిని పౌరసరఫరాల శాఖ నుంచి రేషన్ షాపుల ద్వారా పాఠశాలలకు అందిస్తారు. రాగి జావ తయారీపై ప్రభుత్వం వీడియో సైతం విడుదల చేసింది. ఉదయం 8.30 గంటలకు విద్యార్థులకు రాగి జావ అందించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. దీని ద్వారా జిల్లాలోని 986 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,26,212 మంది విద్యార్థులకు మేలు చేకూరనుంది.

జగనన్న గోరుముద్ద ప్రస్తుత మెనూ..

సోమవారం: వెజ్ పలావు, గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం: రాగి జావ, పులిహోర, చెట్నీ, గుడ్డు
బుధవారం: వెజ్ బిర్యానీ, బంగాళాదుంప కూర, గుడ్డు, చిక్కీ
గురువారం: రాగి జావ, లెమన్ రైస్, టమాటా చెట్నీ, గుడ్డు
శుక్రవారం: అన్నం, పప్పు, గుడ్డు, చిక్కీ
శనివారం: రాగి జావ, ఆకుకూర అన్నం, స్వీట్ పొంగల్

మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
అనపర్తి	42	4,481
బిక్కవోలు	39	4,689
చాగల్లు	39	4,547
దేవరపల్లి	45	6,218
గోకవరం	51	6,530
గోపాలపురం	52	5,783
కడియం	51	6,230
కోరుకొండ	55	7,776
కొవ్వూరు	54	6,622
నల్లజర్ల	58	6,686
నిడదవోలు	70	7,063
పెరవలి	48	4,220
రాజమహేంద్రవరం రూరల్	57	10,719
రాజమహేంద్రవరం అర్బన్	87	18,320
రాజానగరం	61	7,720
రంగంపేట	48	5,027
సీతానగరం	57	5,146
తాళ్లపూడి	32	4,000
ఉండ్రాజవరం	40	4,435
మొత్తం	986	1,26,212

ప్రతి విద్యార్థి తాగేలా చూస్తాం



ప్రభుత్వ పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి రాగిజావ తాగేలా చూస్తాం. అది తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను పిల్లలకు వివరిస్తాం. ఈ మేరకు హెచ్ఎమ్‌లు, ఉపాధ్యాయులందరికీ సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశాం.
– బి.దిలీప్‌కుమార్, అర్బన్ రేంజ్ డీఐ, రాజమహేంద్రవరం

నేటి నుంచి అమలు



అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థులకు మంగళవారం నుంచి రాగి జావ అందించేందుకు చర్యలు చేపట్టాం. మధ్యాహ్న భోజన నిర్వాహకులు వారానికి మూడు రోజులు రాగి జావ తయారు చేసి విద్యార్థులకు అందించాలి.
– ఎస్.అబ్రహం, జిల్లా విద్యాశాఖాధికారి

పోషకాలు అధికం



వేరుశనగ, నువ్వులు, ఆకుకూరలు, గుడ్డుతో పాటు రాగి పిండిలో కాల్షియం పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల దృఢత్వానికి, బలాన్ని అందించేందుకు తోడ్పడతాయి. పిల్లల్లో ఎదుగుదలకు, రక్తహీనత నివారణకు ఉపయోగపడతాయి. వేసవిలో రాగి జావ వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
– డాక్టర్ కె.సుధాకర్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, ధవళేశ్వరం

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం


లోవరాజుకు నగదు అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెం జాతీయ రహదారిని దాటుతుండగా మోటారు సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన కన్నాబత్తుల లోవరాజుకు శనివారం వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి చేతుల మీదుగా సహకారం అందించారు. ప్రమాదానికి కారకుడైన మోటారు సైకిలిస్టు ద్వారా రూ.లక్ష అందజేశారు. బాధితుడు లోవరాజు ప్రమాద సంఘటనను విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రమాదానికి కారకుడితో మాట్లాడి పరిహారం ఇప్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వాకా నరసింహారావు, తూళ్లూరి గంగరాజు, బత్తిన వెంకటరావు పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రతతోనే శరీర ఆరోగ్యం

ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగురెడ్డి


శిబిరంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సీహెచ్ భాగ్యలక్ష్మి

అనపర్తి: నోటి పరిశుభ్రతతో శరీరం ఆరోగ్యంగా ఉంటుందని అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగురెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో నోటి ఆరోగ్యం, దంత సమస్యలపై అవగాహన, దంత పరీక్షలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన డాక్టర్ రామగురెడ్డి మాట్లాడుతూ నోటిని సరిగ్గా శుభ్రం చేసుకోకపోతే దంత సమస్యలు, చిగుళ్ల వ్యాధులు తలెత్తి అవి ఇతర అనారోగ్యానికి దారి తీస్తాయని తెలిపారు. దంత వైద్యులు డాక్టర్ టీవీ శ్రీధర్, డాక్టర్ సీహెచ్ భాగ్యలక్ష్మి, డాక్టర్ సుష్మారాణి తదితరులు మాట్లాడుతూ తేమగా ఉండే నోటిలో బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటుందని, చిగుళ్లలో వ్యాపించే ఇన్ఫెక్షన్లు శరీరంలోని ఇతర అవయవాలపై దుష్ప్రభావం చూపుతాయని చెప్పారు. నోటిని శుభ్రంగా ఉంచుకునేందుకు రోజుకు రెండు పూటలా బ్రష్ చేసుకోవడంతో పాటు ఆహారం తీసుకున్న వెంటనే నోటిని పుక్కిలించాలని సూచించారు. దంత సమస్యలు ఏర్పడితే తక్షణం దంత వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకుంటే తొలి దశలోనే దంత వ్యాధులను గుర్తించి వాటిని నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన దంత ఆరోగ్య శిబిరంలో సుమారు 150 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి చికిత్స చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస వర్మ, డాక్టర్ ప్రదీప్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు

కాకినాడ జిల్లా డ్వామా పీడీ వెంకటలక్ష్మి


సామాజిక తనిఖీ ప్రజావేదికలో పనుల వివరాలు నమోదు చేసుకుంటున్న పీడీ వెంకటలక్ష్మి

పెదపూడి: ఉపాధి హామీ పథకం పనుల్లో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ జిల్లా డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం 2021–2022 ఆర్థిక సంవత్సరానికి 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. తొలుత రామేశ్వరం గ్రామంలో డీఆర్పీలు, వీఎస్ఏలు చేసిన తనిఖీ నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి మొత్తం 750 పనులు జరిగాయన్నారు. వీటిలో కూలీలకు వేతనాలుగా రూ.4,99,82,509, మెటీరియల్ వ్యయంగా రూ.4,49,54,657 వినియోగించారన్నారు. మొత్తంగా రూ.9,49,37,166 నిధులకు గాను సామాజిక తనిఖీ చేపట్టారన్నారు. వీటిలో బినామీ మస్తర్లు వేయడం, మస్తర్లో వేలిముద్రలు, సంతకాలు తేడాలు ఉండటం, చేసిన పనులకు సంబంధించి కొలతలు ఎక్కు,వ, తక్కువలుండటం వంటివాటిని గుర్తించి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ వసంత మాధవి, ఎంపీపీ కేతా తులసి, అంబుడ్స్‌మన్ జ్యోతి, ఎంపీడీఓ పి.వి జయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధాకర్‌పై దాడికి నిరసన


గోకవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ దళిత నాయకులు

గోకవరం: అసెంబ్లీలో వైఎస్సార్ సీపీకి చెందిన దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడాన్ని నిరసిస్తూ స్థానిక ఠాణాసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం ఆందోళన వ్యక్తం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గుల్లా ఏడుకొండలు తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా దళిత ఎమ్మెల్యేపై టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడం హేయమైన చర్యన్నారు. దళితులంటే టీడీపీ నేతలకు ఏమాత్రం గౌరవం, అభిమానం లేదనేది మరోసారి రుజువైందన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ దళిత నాయకులు బిజ్జి రాజు, మచ్చా మోహన్, మచ్చా జయలక్ష్మి, మందపాటి సతీష్, జక్కల వెంకన్న, కొండేటి పాపారావు, నేతల సీలయ్య పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల నిరసన

అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామిపై వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు దాడి చేశారని ఆరోపిస్తూ స్థానిక ఠాణాసెంటర్‌లో టీడీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు.

వివిధ కేటగిరీల్లో 12 ఉత్తమ పురస్కారాలు


ఉత్తమ క్లబ్ అవార్డు తీసుకుంటున్న వెంకటరెడ్డి తదితరులు

పెదపూడి: జి.మామిడాడలోని లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీ సూర్య క్లబ్ జిల్లాలో రీజియన్–3లో నిర్వహించిన భావన అవార్డు ప్రదానోత్సవంలో వివిధ కేటగిరీల్లో 12 ఉత్తమ పురస్కారాలను కైవసం చేసుకుందని క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాళ్లరేవులో ఆదివారం రాత్రి నిర్వహించిన రీజియన్ క్లబ్‌ల సమావేశంలో 2022–2023 సంవత్సరానికి ప్రకటించిన అవార్డుల్లో ఉత్తమ అధ్యక్షుడిగా ద్వారంపూడి వెంకటరెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా ద్వారంపూడి యువ రాజారెడ్డి, ఉత్తమ కోశాధికారిగా డీఆర్‌కె రెడ్డితో పాటు రీజియన్ ఉత్తమ క్లబ్‌గా, పలు సేవా కార్యక్రమాల విభాగాల్లోనూ పురస్కారాలు లభించాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ మెంటర్ మండ రాజారెడ్డి, పప్పు రామకృష్ణారెడ్డి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, ద్వారంపూడి వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని అను, గైడ్ రమ్యసుధలను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: ఇన్‌స్పైర్ మానక్ ఆన్‌లైన్ వైజ్ఞానిక ప్రదర్శనలో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం.అను రూపొందించిన నిర్భయ ట్రైన్ విత్ వేకెన్సీ ఇండికేషన్ అండ్ రెస్క్యూ మెకానిజమ్ అనే ప్రాజెక్టు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి సోమవారం తెలిపారు. పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి నుంచి మొత్తం 232 ప్రాజెక్టులు పాల్గొన్నాయన్నారు. ప్రాజెక్టు రూపకల్పనలో జీవశాస్త్ర ఉపాధ్యాయిని రమ్యసుధ గైడ్‌గా వ్యవహరించారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని అను, గైడ్ ఉపాధ్యాయిని రమ్యసుధలను మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు, హెచ్ఎం పార్థసారథి అభినందించారు.

నీటమునిగిన మొక్కజొన్న కంకులు


చినకొండేపూడిలో మొక్కజొన్న కంకులను ముంపునీటి నుంచి బయటకు తీస్తున్న కూలీలు

సీతానగరం: ఇటీవల కురిసిన వర్షానికి చినకొండేపూడిలో మొక్కజొన్న కుంకులు మునిగిపోయాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెదురుమదురు వర్షాలతో రైతులు మొక్కజొన్న కంకులను ఆరబెట్టిన కళ్లాలపై బరకాలు, టార్పాలిన్లు వేసి ఒబ్బిడి చేసుకున్నారు. అయితే ఆదివారం ఉదయం కురిసిన అధిక వర్షానికి ఆ కళ్లాల్లోకి నీరు చేరింది. నీటిలో మొక్కజొన్న కంకులు తేలియాడాయి. రాపాకకు చెందిన మద్దాల సుభాషిణి, మద్దాల వెంకన్నబాబు, మద్దిపాటి బాబురావు (బుజ్జియ్య), శ్రీనులకు చెందిన మొక్కజొన్న పంట నీట మునగడంతో కూలీలతో కంకులను ట్రాక్టర్‌పై గ్రామంలోకి తీసుకువెళ్తున్నారు. మగ కూలీకి రూ.500, ఆడ వారికి రూ.400 చొప్పున చెల్లించి పంటను నీటి నుంచి బయటకు తీస్తున్నారు. ఇలా ఎకరానికి రూ.7 వేలు ఖర్చవుతోందని చెబుతున్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

సీతానగరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటనష్టం అంచనాపై నిర్ణయం తీసుకుంటామని డీఏఓ మాధవరావు అన్నారు. సోమవారం చినకొండేపూడిలో వర్షాలకు పడిపోయిన మొక్కజొన్న పంటలను కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, ఏఓ సూర్యరమేష్‌తో కలసి ఆయన పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి చూపాలి

సీతానగరం: జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల్లో మెరుగైన ప్రగతి తీసుకురావాలని ఎంపీడీవో కె.రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ డీఈ ఆర్‌వీ బాబు, ఏఈ ఏ.రామారావుతో కలసి హౌసింగ్‌పై డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. హౌసింగ్ డీఈ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి గృహాలు మంజూరు చేశామని, సత్వరమే వాటిని పూర్తి చేసి గృహప్రవేశాలు జరుపుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీవో నాగేశ్వేణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర


నూకాలమ్మ


జాతరలో ఆకట్టుకున్న వేషధారణలు

రాజానగరం: గ్రామదేవత నూకాలమ్మ తీర్థమహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో సోమవారం జాతర నిర్వహించారు. ముందుగా సుఖశాంతులను కోరుతూ తాటిచెట్టును బండికి కట్టి జగన్మాత ఆలయం నుంచి ఊరంతా ఊరేగింపు జరిగింది. పలువురు మహిళలు తాటిచెట్టుపై బిందెలతో నీరు పోస్తూ, పసుపుకుంకుమలు చల్లారు. అనంతరం గ్రామంలో జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యలతో పాటు వివిధ రకాల వేషధారణలు అలరించాయి. మంగళవారం తీర్థమహోత్సవం జరగనుంది.

నేడు కాండ్రేగుల నూకాలమ్మ తీర్థం

పెదపూడి: పెదపూడి మండలం కాండ్రేగుల నూకాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించడానికి సకల ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం తెలిపారు. కొత్తగా వివాహం చేసుకున్న దంపతులు, వాహనాలు కొనుగోలు చేసుకున్నవారు తీర్థ మహోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశారు. జి.మామిడాడ, కరప, కూరాడ, పెదపూడి కూడళ్లలో భక్తులకు రవాణా ఇబ్బందులు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నేడు నూకాలమ్మ జాతర

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన నూకాలమ్మ జాతర ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. మంగళవారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. జాతర సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

నేడు విద్యార్థులకు రాగిజావ పంపిణీ

రంగంపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింట్లోను విద్యార్థులకు మంగళవారం నుంచి రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు స్థానిక ప్రజాప్రతినిధులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, పాఠశాలల హెచ్ఎంలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఇక నుంచి రోజూ విద్యార్థులకు రాగిజావ పంపిణీ జరుగుతుందన్నారు.

సత్తిరాజుకు ఉగాది పురస్కారం


ఉగాది పురస్కారం అందుకుంటున్న సత్తిరాజు

రాజానగరం: దివాన్ చెరువుకు చెందిన సామాజిక, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నిడమర్తి సత్తిరాజుకు ఉగాది పురస్కారం లభించింది. ఏపీ రాష్ట్ర సాహిత్య అకాడమీ, కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ, శ్రీశ్రీ కళావేదిక సంయుక్తంగా రాజమహేంద్రవరంలోని ఆనం రోటరీ హాలులో నిర్వహించిన ఉగాది పురస్కారాలలో సినీనటుడు ఆర్.నారాయణమూర్తి చేతుల మీదుగా సత్తిరాజు ఈ పురస్కారం అందుకున్నారు. డాక్టర్ ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా రెండు దశాబ్దాలుగా అందిస్తున్న సామాజిక, ఆధ్యాత్మిక సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించిందని సత్తిరాజు ఆనందం వ్యక్తం చేశారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ స్వామినాయక్

సీతానగరం: క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఎంఈఓ కె.స్వామినాయక్ అన్నారు. చినకొండేపూడిలోని సూర్యచంద్ర హైస్కూల్ ఆవరణలో కరస్పాండెంట్ కె.ప్రసన్న రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల ఆర్ట్, స్పోర్ట్స్ మీట్‌ను సోమవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వాలీబాల్, కోకో, కబడ్డీ, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఫణీంద్ర పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


ఊలపల్లిలో పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎంఎస్ఓ కృష్ణ తదితరులు

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని ఇన్‌చార్జి ఎంఎస్ఓ కృష్ణ స్వాధీనం చేసుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నల్లమిల్లి గ్రామానికి చెందిన పాలిపిరెడ్డి శివయ్య అనే వ్యక్తి ఊలపల్లి గ్రామంలో 760 కేజీల పీడీఎస్ బియ్యాన్ని ప్రజల నుంచి కొనుగోలు చేసి నిలువ చేశారు. స్థానికుల సమాచారం ఆధారంగా దాడి చేసి పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని ఎంటీయూ వాహనం ద్వారా ఎంఎల్ఎస్ఓ పాయింట్‌కు తరలించారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన శివయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎంఎస్ఓ కృష్ణ తెలిపారు. దాడిలో వీఆర్వో కొటాని శ్రీను పాల్గొన్నారు.

కాపర్ వైరు చోరీపై ఫిర్యాదు

బిక్కవోలు: వ్యవసాయ బోరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు చోరీపై ఫిర్యాదు అందినట్టు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొంకుదురు గ్రామానికి చెందిన సామంచి శ్రీనివాస సుబ్రహ్మణ్యంకు ఆర్ఎస్‌పేట శివారు నల్లమిల్లి రోడ్డులో వ్యవసాయ పొలం ఉంది. అక్కడి వ్యవసాయ బోరుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరుని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని సోమవారం శ్రీనివాస సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం వరకు ట్రాన్స్‌ఫార్మర్ బాగానే ఉందని 15వ తేదీన వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ కింద పడేసి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బుజ్జిబాబు తెలిపారు.